

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఖరారు

ఉమ్మడి జిల్లాలో 73 మండల పరిషత్‌లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 16 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సంఖ్యను బుధవారం ఖరారు చేశారు. జిల్లాల వారీగా జాబితాను వెలువరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 73 మండల పరిషత్‌లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. ముందే ఈ జాబితా తెరమీదకు రావడంతో గ్రామపంచాయతీ ఎన్నికలను మరింత ఆలస్యంగా నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలాల వారీగా ఖరారైన ఎంపీటీసీ స్థానాలు ఎన్ని.. ఏయే రిజర్వేషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.. అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడంపై ఆశావహులు దృష్టి సారించారు.



ఉమ్మడి జిల్లాలో స్థానాల సంఖ్య

సంగారెడ్డి	జడ్పీటీసీ	26
	ఎంపీటీసీలు	271
సిద్దిపేట	జడ్పీటీసీ	26
	ఎంపీటీసీలు	230
మెదక్	జడ్పీటీసీ	21
	ఎంపీటీసీలు	190

సర్కారు పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్లు

ఆగస్టు 15 నాటికి సంగారెడ్డి జిల్లాలో 1,174 బడులకు



ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న కార్మికులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు కట్టెల పొయ్యిల బాధలు తప్పనున్నాయి. ఇక నుంచి ప్రతీ పాఠశాలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకున్నది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 15 నాటికి అన్ని సర్కారు బడుల్లో గ్యాస్ కనెక్షన్లు అందించేలా చూడాలని సంబంధిత కలెక్టర్, డీఈవోలకు ఆదేశాలు ఇచ్చారు. సంగారెడ్డి జిల్లాలో 1,215 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో ఇప్పటికే 41 పాఠశాలల్లో ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇంకా 1,174 పాఠశాలల్లో కొత్తగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కట్టెలపై వంట చేయడానికి పొగతో, వంట చెరకుతో ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ఘనపురం కుడి కాల్వ నుంచి స్వచ్ఛని జలధారలతో వంకలు దాటుతూ ప్రవహించే మంజీరమ్మ మెదక్ పట్టణంలో కాలుష్య కాటుకు గురవుతుంది. మెతుకుసీమ నేలలను తడుపుతూ, పచ్చని పంటలకు జీవం పోయాల్సిన చోట వ్యర్థ జలాలతో కలుషితమై శోక తప్తమవుతోంది. పిచ్చిమొక్కలతో, గుర్రపు డెక్కలతో మురికి కూపంగా మారి చివరి ఆయకట్టుకు చేరకుండానే సమాధి అవుతోంది.



మెదక్‌లో గంగినేని థియేటర్ వద్ద కలుస్తున్న డ్రైనేజీ నీరు

మురికి కూపం.. మంజీర శోకం

ఎంఎన్ కెనాల్‌కు కాలుష్య కాటు .. మెదక్ పట్టణంలో కాల్వలోకి డ్రైనేజీ నీరు

- గుర్రపు డెక్కతో నీటి ప్రవాహానికి అడ్డంకులు
- కలెక్టర్‌కు నివేదించిన ఇరిగేషన్ అధికారులు
- ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుతో పరిష్కారం

మెదక్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే మహబూబ్ నహర్ (ఎంఎన్) కెనాల్ మురుగు నీటితో కలుషితమవుతోంది. ఘనపురం ఆనకట్ట కుడి కాల్వ అయిన ఈ ఎంఎన్ కెనాల్ ద్వారా కొల్చారం, మెదక్, హవేళీఘనపురం మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు మంజీర జలాలు అందుతున్నాయి. అయితే, కెనాల్‌లోకి మెదక్ పట్టణంలో మురుగు నీరు నేరుగా చేరుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పట్టణీకరణతో డ్రైనేజీ సమస్యలు

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత మెదక్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది. సుమారు 70 వేల జనాభాతో పట్టణం అన్ని దిక్కులా విస్తరించింది. ఐదేళ్లలో జనాభా గణనీయంగా పెరిగింది. కానీ, అందుకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. మెదక్ పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ నుంచి వెలువడే మురుగు నీరు గంగినేని థియేటర్ సమీపంలో నేరుగా ఎంఎన్ కెనాల్‌లోకి వదులుతున్నారు. ప్రత్యామ్నాయమార్గం లేదని, అధికారులు ఇలా చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

గుర్రపు డెక్క.. పిచ్చిమొక్కలు

మెదక్ పట్టణ డ్రైనేజీ నీరు ఎంఎన్ కెనాల్‌లో కలుస్తుండటంతో ఫలితంగా కాల్వ అంతటా గుర్రపు డెక్క, ఇతర పిచ్చి మొక్కలు విపరీతంగా వ్యాపించి నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తున్నాయి. మెదక్ పట్టణం మీదుగా మగ్దూంపూర్, ముత్తాయికోట, కూచన్‌పల్లి, ఫరీద్‌పూర్, సర్దెన, జక్కన్నపేట వరకు ప్రవహించే ఎంఎన్ కెనాల్‌లో పిచ్చి మొక్కల కారణంగా చివరి ఆయకట్టుకు నీటి ప్రవాహంలో అడ్డంకులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలను తొలగించినా, అవి

మిగతా 8వ పేజీలో



మెదక్ పట్టణ పరిధిలో కాలువ కనపడకుండా పెరిగిన పిచ్చిమొక్కలు

ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు డిమాండ్

మెదక్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన డ్రైనేజీ నాలాల నుంచి నేరుగా ఎంఎన్ కెనాల్‌లోకి మురుగు నీరు కలుస్తుండటంతో కాల్వ నీటి నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంట నష్టంతో పాటు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మురుగునీటి శుద్ధి కేంద్రం (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ప్రావీణ్య పనితీరుపై ప్రశంసలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అభినందన

పటాన్‌చెరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలలో భాగంగా బుధవారం పటాన్‌చెరులో నియోజకవర్గ పరిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల పాశమైలారం సిగాచి దుర్ఘటన సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య నిరంతరం శ్రమించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. అన్ని విభాగాలను సమన్వయ పరిచి, 15 రోజులు పనిచేసిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ముందుగా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు, మహిళా సమైఖ్య సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య పటాన్‌చెరు గౌతంనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పుట్టిన రోజు నాడే అంత్యక్రియలు

- కాంగ్రెస్ నేత హత్య నిందితుల అన్వేషణలో పోలీసులు
- పది బృందాలు ఏర్పాటు.. సీసీ పుటేజీల పరిశీలన
- స్నేహితులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల విచారణ





పైతర గ్రామంలో అంత్యక్రియల్లో పాల్గొన్న జనం, గతేడాది పుట్టినరోజు వేడుకల్లో అనిల్

మెదక్/కొల్చారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : దుండగుల కాల్పులకు బలైన కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా కార్యదర్శి మారెల్లి అనిల్ పుట్టిన రోజు(బుధవారం) నాడే అంత్యక్రియలు జరిగాయి. సోమవారం రాత్రి హత్యకు గురైన అనిల్, గతేడాది ఇదే రోజున కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య పుట్టిన రోజు ఘనంగా జరుపుకున్నాడు. బుధవారం పైతర గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో వారంతా పాల్గొని నాటి ఘటనను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అనిల్ అకాల మరణం తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

రంగంలోకి పది బృందాలు

అనిల్ హత్య నేపథ్యంలో పోలీసులు నిందితులను పట్టుకునేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే అనిల్ సెల్‌ఫోన్ కాల్ డేటా పరిశీలిస్తున్నారు. రాయలసీమ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అనిల్ సోమవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నందున తిరుగు ప్రయాణంలో అక్కడి నుంచి పోతంశెట్టిపల్లి వరకు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆయనవెంట మరికొంత మంది కారులో ఉండగా, వారంతా ఎక్కడెక్కడ దిగారు అన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. అలాగే, నిత్యం ఆయన వెంట ఉండే మిత్రులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరుపుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సెటిల్‌మెంట్‌లో ఎవరెవరు పాల్గొన్నారు అన్న అంశంపై కూడా పోలీసులు నిఘా పెట్టారు. అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్

- కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల అవినీతి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని, కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని అన్నారు. ఎన్నికల హామీలో లేకపోయినా సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లాకు 13 వేలకుపైగా రేషన్ కార్డులు మంజూరు చేశామని, త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చి కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు.

కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా ఒక పెద్ద పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం జిల్లా మండల సమైఖ్యలకు సహకరిస్తుందని అన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల వెంట అర ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలం మహిళా సమైఖ్యలకు అందజేసి ఆ ప్రాంతాల్లో పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొదటి పెట్రోల్‌బంక్‌ను సంగారెడ్డిలో ఇటీవలే ప్రారంభించామని గుర్తుచేశారు. ఎరువుల పిచికారీకి డ్రోన్లు, ఓం మహిళా క్యాబ్ డ్రైవర్ల శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టి జిల్లాను ఆదర్శంగా నిలిపామని మంత్రి దామోదర్ తెలిపారు.

మహిళా సాధికారతకు పథకాలు : అంజిరెడ్డి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని ఆయన చెప్పారు. 2014 కంటే ముందు దేశంలో స్వయం సహాయక బృందాలకు రుణాలు రూ.25 వేల కోట్లు మాత్రమే అందించగా, బీజేపీ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో బ్యాంక్ లింకేజ్ స్కీము ద్వారా రూ.9 లక్షల కోట్లకుపైగా పెరిగాయన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీఆర్డీవో పీడీ జ్యోతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెదక్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అండ్ సీనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14,16,18 బాలబాలికలకు రన్స్, త్రో గేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల 3, 4న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగితా వివరాలకు 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుల యూడీఐడీ కార్డులతో బహుళ ప్రయోజనాలు

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లా ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు
- 300మంది దివ్యాంగులకు యూడీఐడీ సర్టిఫికెట్స్ జారీ



దివ్యాంగులతో మాట్లాడుతూన్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కల్చరల్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు యూడీఐడీ కార్డు మంజూరీ క్యాంపును బుధవారం మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగుల యూడీఐడీ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఫిజియోథెరపీ యూనిట్, వృద్ధుల విభాగం రోగులతో మాట్లాడి వారి వైద్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు జాతీయ డేటాబేస్‌ను రూపొందించడానికి ప్రతి వ్యక్తికి ప్రత్యేక దివ్యాంగుల గుర్తింపు కార్డు యూనిక్ డిసబిలిటీ ఐడెంటిఫికేషన్ కార్డ్‌ను జారీ చేయడానికి ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు గడిచిన నెల రోజుల్లో 300 మంది దివ్యాంగులకు యూడీఐడీ కార్డ్స్ జారీ చేశామని, స్లాట్ బుక్ చేసుకుని ఇంకా 150 మంది మిగిలి ఉన్నారని అన్నారు. 21 రోజుల్లో స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులకు యూడీఐడీకార్డ్స్ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ సునీత, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివ దయాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్ పాఠశాలల విద్యతోనే సాధ్యం

కొల్చారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొల్చారం మండలం దేశ్య తండా ప్రాథమిక పాఠశాలను మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలకు రాని విద్యార్థుల గురించి ఉపాధ్యాయులను అడిగి ఆరా తీశారు. వరుసగా రెండు మూడు రోజులుగా పాఠశాలలకు రాని విద్యార్థుల ఇళ్లు తిరిగి పాఠశాలకు విద్యార్థులను ఎందుకు పంపడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సోషల్ మీడియా కట్టడి తప్పదు

గజ్వేల్/వర్గల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు సమాజాన్ని చైతన్యపరచడం ద్వారా విప్లవాన్ని సృష్టించవచ్చని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు ఆర్. దిలీప్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలోని టీజీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన 'సమకాలీన సమాజం-జర్నలిస్టుల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాకు గేట్‌వే లేదని, సమాజమే పరిమితిని విధించాలన్నారు. సోషల్ మీడియాకు సైతం త్వరలోనే చెక్ పడబోతుందని, చట్టపరమైన పరిమితులు ఏర్పాటు చేయబోతున్నారని చెప్పారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ అన్ని ప్రెస్‌క్లబ్‌లకు భిన్నమైనదని, గొంతు లేని ప్రజలకు గొంతుగా నిలిచిందని, ప్రజాకాంక్షలకు అనుగుణంగా పనిచేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, తహసీల్దార్ బాలరాజు, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాచన్న స్వామి హుండీ ఆదాయం రూ.3.37 లక్షలు



రాచన్న స్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కోహీర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్న స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మార్చి 27వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు భక్తులు స్వామి వారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3,37,896లు వచ్చినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు శ్రీనివాస్, ఆలయకమిటి సభ్యులు దయానంద్‌పాటిల్, గోపాల్, రమేష్, రాజన్న, రాచన్న, చెంద్రప్ప, మహేష్, మున్నూరు రాజు, నాచం నగేష్, బస్వరాజ్, అంజన్న, శివానంద్, శివరాజ్‌స్వామి సోమలింగం, ప్రతాప్‌రెడ్డి, సిద్దయ్య స్వామి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు నిరసన



అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు ఎల్లారెడ్డి

అక్కన్నపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ పట్టించుకోవడం లేదంటూ బుధవారం అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుమారుడితో కలిసి నిరసనకు దిగాడు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చిలుపూరి ఎల్లారెడ్డి అనే రైతుకు సర్వే నంబర్‌లు 266, 267లో 23 ఎకరాల భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో ఉన్న తన భూమిని రెవెన్యూ అధికారులు బ్లాకు లిస్టులో పెట్టారని ఆరోపించారు. తన భూమిని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టారని, బ్లాక్ లిస్టు నుంచి తొలగించాలని తహసీల్దార్, ఆర్‌డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఐదు సార్లు దరఖాస్తులు సమర్పించాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఈనెల 7న సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీజిల్ ప్యాకెట్‌తో వచ్చాడు. పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద డీజిల్ ప్యాకెట్ లభించింది. ఈ సంఘటన గురించి పత్రికల ద్వారా తెలుసుకున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆ రైతు భూ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయినా తహసీల్దార్ తన భూమిని బ్లాక్ లిస్టులో నుంచి తీయడం కుదరదని చెప్పాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తన సమస్యను పరిష్కరించాలని ఎల్లారెడ్డి కోరారు.

గంజాయితో పట్టుబడ్డ యువకుడు అరెస్ట్

ములుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ములుగు మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి మణికంఠ ఈ నెల 15న మధువన్ వెంచర్ వద్ద గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ములుగు ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

కొమురవెల్లి, జూలై16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చి బస చేసిన గది ముందు కూర్చున్న మహిళపై బుధవారం కోతి దాడి చేసింది. దీంతో మహిళ చేతికి గాయాలయ్యాయి. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన లావుడ్య శాంతి మల్లికార్జున స్వామికి బోనం చెల్లించి దర్శనం చేసుకున్న తర్వాత తిరిగి వచ్చి బస చేసిన గది ముందు కూర్చొని కుటుంబ సభ్యుల కోసం వేచి చూస్తోంది. అప్పుడు కోతి దాడి చేయడంతో చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కోతిని వెళ్లగొట్టారు. కొమురవెల్లిలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భక్తులతో పాటు, స్థానికులను గాయాల పాలు చేస్తున్నాయని, ఆలయ అధికారులు కోతుల బెడద నుంచి భక్తులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బెజ్జంకి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం బెజ్జంకి మండలం బేగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు బేగంపేటకు చెందిన పగోలం రాజేశం (39) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రాజేశానికి భార్య భాగ్యలక్ష్మీ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం, కుటుంబ పోషణ కోసం రాజేశం అప్పులు చేశాడు. చేసిన అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాజేశం ఆటో తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు రాజేశాన్ని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్‌రావు తెలిపారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వట్‌పల్లి, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఖదిరాబాద్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై లవకుమార్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖదిరాబాద్ గ్రామానికి చెందిన చాకలి యాదయ్య(47) ఈనెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు జోగిపేట ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

వ్యవసాయ బావిలో మృతదేహం

రేగోడు జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో బుధవారం మృతదేహం లభ్యమయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకి తీయగా రేగోడు గ్రామానికి చెందిన ఉబ్బి పెంటయ్య(18)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి ప్రైవేటు హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పూడూరుకు చెందిన తరుణ్(20) ఇక్కడి బీవీఆర్‌ఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పట్టణంలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉండే తరుణ్ బుధవారం సాయంత్రం గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన అక్కడి వారు కిందికి దించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

యువకుడి అదృశ్యం

నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేసే ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. బుధవారం సాయంత్రం ఎస్సై జగన్నాథం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని సీతారాంపూర్‌కి చెందిన వెల్మకన్న జగన్ అనే యువకుడు నర్సాపూర్‌లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. ఈ నెల 11వ తేదీన పెట్రోలు బంకుకు వెల్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. ఆ రోజు నుంచి ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబీకులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్నాథం తెలిపారు.

హత్యాయత్నానికి దారి తీసిన..

నిజాంపేట,జూలై 16 (ఆంధ్రజ్యోతి): భూమి గొడవలు హత్యాయత్నానికి దారితీశాయి. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు. బుధవారం రిమాండ్ చేశారు. నిజాంపేట ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్లాపూర్ గ్రామానికి చెందిన పట్నం రాజు, పట్నం అశోక్, శ్రీశైలం వీరి మధ్య కొన్నేళ్లుగా భూ -వివాదం నడుస్తుంది. ఇది మనసులో పెట్టుకున్న పట్నం అశోక్, శ్రీశైలం కలిసి వ్యవసాయ పనులలో నిమగ్నమైన పట్నం రాజు తలపై పారా, కట్టెలతో కొట్టి గాయపరిచారు. ఆ సమయంలో పక్క పొలాల్లో ఉన్న వారు చేరుకొని ఆపడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదయింది.

బండ్లు ఆగం.. ఒళ్లు హూనం


గుంతల మయంగా ఖానాపూర్-బడంపేట గ్రామాల రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు


కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి-బడంపేట గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి

కోహీర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దాదాపు 90 కిలోమీటర్ల అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్లనే ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయాయి. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లాలన్నా గుంతల రోడ్లపై నుంచే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఒళ్లంతా హూనమై ఆస్పత్రుల పాలైతే.. వాహనాలు పాడై షెడ్లకు తీసుకెళ్లాల్సి దుస్థితి నెలకొన్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రివేళల్లో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పీచేర్యాడి గ్రామం నుంచి పీచేర్యాడి తండా వరకు ఉన్న 7 కిలోమీటర్ల రోడ్డు కంకర తేలి పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో గిరిజన తండా వాసులు నిత్యం నరకం చూస్తున్నారు. అలాగే పీచేర్యాగడి పాత తండా నుంచి కొత్త తండా మీదుగా పర్షపల్లి గ్రామం వరకు 5 కిలోమీటర్లు, బడంపేట నుంచి మనియర్‌పల్లి గ్రామం వరకు, 65వ జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల మీదుగా 15 కిలోమీటర్ల రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను బాగుచేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి పాడైన రోడ్లను బాగుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలి అధ్వానంగా మారిన పిచేర్యగడి తండా రోడ్డు


కోహీర్ నుంచి పైడిగుమ్మల్, రాజనెల్లి గ్రామాలకు వెళ్లే దారిపై గుంతలు

సర్కార్‌కు నై.. ప్రైవేటుకు సై

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు అంతంతమాత్రమే
- శిథిలావస్థలోని భవనాలు, వసతుల లేమినే కారణం
- ప్రైవేటు యాజమాన్యాల ఆర్భాటపు ప్రకటనలకు ఆకర్షితులవుతున్న పిల్లల తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు ప్రభుత్వ బడులంటే మాత్రం ససేమిరా అంటున్నారు. వేలకు వేలు ఖర్చైనా సరే ప్రైవేటు, కార్పొరేట్ బడుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలు విద్యార్థుల్లేక వెలవెలబోతున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో అన్నీ తరగతులకు కలిపి 25లోపే విద్యార్థులున్నారంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. శిథిలావస్థకు చేరిన భవనాలు, అరకొర వసతులే ఇందుకు కారణంగా తెలుస్తున్నది.

కొండాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి సరైన సమయంలో నిధులు అందకపోవడం, పనులలో జాప్యం జరగడం, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నాణ్యత లోపాలు వంటివి ప్రధాన కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం లేదు. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలలు అందమైన కరపత్రాలు, ఆకర్షణీయమైన మాటలతో తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక బోధన, ర్యాంకులు, డిజిటల్ బోర్డులు, వివిధ పాఠ్యపుస్తకాలు, కోర్సులు, అందమైన భవనాలు, బస్సు సౌకర్యాలు వంటివి చూపి లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయి. పక్కవారి పిల్లల చేరికలను ఆదర్శంగా చూపి, తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేటుపాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రభావితం చేస్తున్నాయి. కొండాపూర్ మండల పరిధిలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు, 32 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 11ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల అడ్మిషన్లు లేకపోవడంతో 2 ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివిన 8 మంది విద్యార్థులు మొదటి విడత కౌన్సిలింగ్‌లోనే బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని ఎంఈఓ దశరథ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధనలభిస్తుందన్నారు. పది పరీక్షల్లో కొండాపూర్ మండల ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు.


హరిదాస్‌పూర్ తమ్మళిబాయ్ పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు

టీ మాందాపూర్ బడిలో నాగుపాము కలకలం

చిన్నశంకరంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ మాందాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాగుపాము కలకలం సృష్టించింది. ఉదయం పాఠశాల సిబ్బంది తరగతి గదులను శుభ్రం చేస్తున్న సమయంలో తరగతి గదిలోని నాగుపాము బుసకొడుతూ పరుగులు తీసింది. దీంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. స్థానికుల సహాయంతో నాగుపామును కర్రలతో చంపేశారు.

ఐదు తరగతులకు ఇద్దరే టీచర్లు

- ఒకే తరగతి గదిలో బోధన



నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోని జగన్నాథరావు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన గందరగోళంగా మారింది. ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు ఇద్దరు టీచర్లు బోధన చేస్తుండటం గమనార్హం. ఈ పాఠశాలకు రెండు గదులు ఉండగా, ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో మిగిలిన ఒకే గదిలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 30 మందికి పైగా విద్యార్థులకు బోధన సాగుతోంది. ఇద్దరు టీచర్లు ఒకే గదిలో ఐదు తరగతులకు పాఠాలు చెబుతుండటంతో, ఏ తరగతికి ఏ పాఠం చెబుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీనివల్ల ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

బోరుమోటారు పనిచేయక విద్యార్థుల ఇక్కట్లు

నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా బోరుమోటారు పనిచేయకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ;ఓ ఇంటి వద్ద ఉన్న నల్లా పైపు వద్ద ప్లేట్లు కడుక్కోవాల్సి వస్తుంది. తాగడానికి కూడా అదే నీరు శరణ్యమైంది.

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో అస్తవ్యస్తం

జహీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కొరవడటం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని, దీంతో గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారుతోందని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వాలు కార్పొరేట్ తరహా విద్యను అందిస్తామని ప్రగల్భాలు పలికినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తమ పిల్లలు ప్రయోజకులవ్వాలంటే ప్రైవేటు పాఠశాలల్లోనే చదవాలని భావించి, అధిక ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.


మూడ్‌తండా ఐదురు విద్యార్థులకు బోధన

5 తరగతులు, 25 దాటని విద్యార్థులు

జహీరాబాద్ మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 80వరకు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 6వేల పైచిలుకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మండలంలోని 9 ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులకు గాను విద్యార్థుల సంఖ్య 25 దాటని పరిస్థితి ఉన్నది. మొగుడంపల్లి మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మంచినీరు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ కింద నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీరు రావడం లేదని ఉపాధ్యాయులు, గ్రామస్థులు తెలిపారు. మౌలిక వసతులు కల్పనలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి, విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రయోగ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. డిగ్రీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్, సెకండియర్ మూడవ సెమిస్టర్, ఫైనలియర్ ఐదవ సెమిస్టర్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 26 వరకు జరుగుతాయని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ డా. శ్రద్ధానందం తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కళాశాల గుర్తింపు కార్డు, హాల్ టికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయక కేంద్రంలో గానీ ఫోన్ నంబర్ 7382929615 ద్వారా సంప్రదించవచ్చున్నారు.

కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎంపీ రఘునందన్‌రావు


పార్టీలో చేరిన వారితో ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మల్లం రాజు సతీమణి మల్లం సుమతి, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్తయ్యగౌడ్, ఇతర నేతలు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు 60 గజాలు మాత్రమే ఉండాలని, పైన ఇంకో ఇల్లు కట్టకూడదన్నది కాంగ్రెస్ పార్టీ విధానమని, కానీ బీజేపీ పార్టీ దీనిని వ్యతిరేకిస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీనియర్ నాయకులు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, ఎరుపుల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగం సత్తయ్య, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌లో సేవ పూర్వజన్మ సుకృతం

- సిద్దిపేట సేవా సమితి సభ్యులు


స్వస్థలం చేరుకున్న సేవా సమితి సభ్యులు

సిద్దిపేట కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అమర్‌నాథ్‌లో యాత్రికుల కోసం సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాద వితరణ కొనసాగుతోంది. అమర్‌నాథ్‌లో 13 రోజులుగా సేవలందించిన సేవా సమితి అధ్యక్షుడు కాచం కాశినాథ్, కార్యవర్గ సభ్యులు చింత శ్రీనివాస్, గౌరవ సభ్యులు కార్తివాడ శ్రీకాంత, పండిత రాంబహద్దూర్ తిరిగి స్వస్థలం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమర్‌నాథ్ యాత్రికులకు సేవ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని, జీవితంలో ఒక్కసారైనా అమర్‌నాథ్ చెంత సేవలందిస్తే జన్మకు సార్థకత లభిస్తుందని అన్నారు. యాత్రికులు భోజనం స్వీకరించి ఇచ్చిన ఆశీస్సులు గొప్పగా గుర్తుండిపోయాయని పేర్కొన్నారు. రెండవ విడత సేవ కోసం సమితి ప్రధాన కార్యదర్శి గంజి రాములు, ఉపాధ్యక్షుడు అయిత రత్నాకర్ అమర్‌నాథ్‌లోని బాల్తాల్ చేరుకున్నారని సేవా సమితి చైర్మన్ చీకోటి మధుసూదన తెలిపారు. మొదటి విడతలో సేవలందించి స్వస్థలం చేరుకున్న సభ్యులకు సేవా సమితి కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పీఆర్వో మాంకాల నవీన్‌న కుమార్ స్వాగతం పలికారు.

విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఆదర్శ పాఠశాల అదనపు డైరెక్టర్ శ్రీనివాస చారి


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ చారి

చిన్నశంకరంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల రాష్ట్ర విద్యాశాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ చారి అన్నారు. బుధవారం ఆయన చిన్నశంకరంపేట తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇంటర్ విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకొని, విద్యాభ్యాసంపై పలు సూచనలు అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సబ్జెక్టుల వారీగా సమీక్షించి, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల కనీస వసతులపై ప్రిన్సిపాల్ వాణితో సమీక్షించి, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆదర్శ పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్, ఏఎంఓ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల నియామకంలో జాప్యంపై నిరసన

సంగారెడ్డి అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని పరీక్ష రాసిన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట వేసిన ఉద్యోగం ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 అని వారు గుర్తు చేశారు. గత మార్చి 10న ఫలితాలు విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇప్పటివరకు కేవలం ప్రొవిజనల్ జాబితా మాత్రమే విడుదల చేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫైనల్ మెరిట్ లిస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు. నియామకాల జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అభ్యర్థులు తెలిపారు. నియామక ప్రక్రియను యుద్ధప్రాతిపదికన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జేమ్స్, ఆనంద్‌కుమార్, భాస్కర్, కరుణజ్యోతి కోరారు.

పథకాల అమలు తీరును పరిశీలించిన కేంద్ర బృందం

మనోహరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవడానికి గౌతోజిగూడ గ్రామాన్ని సందర్శించింది. జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం ఈ నెల 15 నుంచి 23 వరకు జిల్లాలో పర్యటించనుంది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని గౌతోజిగూడ గ్రామంలో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం ఆవాస్ యోజన, ఉపాధి హామీ పనులు, ఎస్‌హెచ్‌జీ పనులను పరిశీలించారు. జీపీ రికార్డులను కూడా పరిశీలించారు. ఈ పర్యటనలో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు సురంజన రెడ్డి, డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, పీఆర్డీ విజయప్రకాష్, ఏఈ స్మైలీ, ఏపీవో ఆదినారాయణ, ఈసీ లక్ష్మీనారాయణ, తాజీమాజీ, ఉప సర్పంచ్ రేణు కుమార్, కార్యదర్శి నవీన్, టీఏ జగపతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


గౌతోజీగౌడా గ్రామంలో కేంద్ర బృందం

శిల్పకు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు



నారాయణఖేడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన మలమంచి శిల్ప టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మలమంచి శిల్ప మాట్లాడుతూ, గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

మట్టి గుట్టను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలపై 'తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు బుధవారం మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ శివారులోని మట్టి గుట్టలను సందర్శించారు. జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ మట్టి తరలిస్తున్న గుట్టను పరిశీలించారు. అనుమతికి మించి మట్టిని తరలించరా లేదా కోణంలో క్షుణ్ణంగా పరిశీలించి, మట్టిని తరలించిన ప్రాంతాన్ని టేప్‌తో కొలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతికి మించి మట్టిని తరలిస్తే అనుమతి రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



బీజేపీకి పంజా విజయ్ రాజీనామా

- నేడు కాంగ్రెస్‌లో చేరిక..!


పంజా విజయ్ కుమార్

రామాయంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడి, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పంజా విజయ్ కుమార్ బీజేపీకి రాజీనామా చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు రాజీనామా లేఖ పంపారు. గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పంజా విజయ్ టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీలకు అన్యాయం జరుగుతున్నందునే బీజేపీని వీడుతున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతితో తెలిపారు. నిజాంపేటకు చెందిన పంజా విజయ్ 2017లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత జడ్పీటీసీగా గెలిచి 2022లో ఆ పార్టీని వీడి బీజేపీకి దగ్గరయ్యారు. ఎమ్మెల్యే సీటు ఇచ్చినా గెలవలేక పార్టీనే విమర్శిస్తావా అంటూ బీజేపీ రాష్ట్ర నాయకులు రాగి రాములు పంజా విజయ్‌పై మండిపడ్డారు.

- నిజాంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పూటకో పార్టీని మారేటోళ్లకు బీజేపీపై మాట్లాడే స్థాయి లేదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంజా విజయ్‌కుమార్ బీజేపీలో పని చేస్తూ కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌కి ఏజెంట్‌గా మారి చీకటి ఒప్పందలు చేసుకొని పార్టీని భ్రష్టు పట్టించే చర్యలు చేశారన్నారు. అతడి రాజీనామాతో బీజేపీకి జరిగే నష్టం ఏమీ లేదన్నారు. నాయకులు చంద్రశేఖర్, నరేష్, రమేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఎల్‌వోసీ అందజేత

నారాయణఖేడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం నాగ్ధర్ ఎర్రగుంటతండాకు చెందిన గామి నిబాయి వైద్యశాల ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు.

పండ్లల్లో పోషకాలు అధికం

జహీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒకరు ఆహారంతో పాటు కొన్ని పండ్లను ప్రతిరోజు తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని దత్తగిరి కాలనీలో రంజోల్ రైతు రమేష్‌రెడ్డి పలువురికి డ్రాగన్ ఫ్రూట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.

బాధితుడికి చేయూత

పుల్‌కల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరుకు చెందిన బీచం లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంగళవారం మృతిచెందింది. ఈ విషయాన్ని గ్రామ నాయకుడు ఆత్కూరి రవీందర్ కాంగ్రెస్ యువ నాయకురాలు, రాజనరసింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిషదామోదర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని పంపించగా.. స్థానిక నాయకులు మృతురాలి భర్త బీచం మల్లేశంకు బుధవారం అందజేశారు.

'పారిశుధ్య కార్మికులు రక్షణ పరికరాలు ధరించాలి'

నారాయణఖేడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్న సమయాల్లో రక్షణ పరికరాలు విధిగా ధరించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నమస్తే వేడుకల్లో భాగంగా కార్మికులకు హెల్మెట్, గ్లౌస్‌లు, దుస్తులు పంపిణీ చేశారు.

విద్యార్థికి సత్కారం

వెల్దుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికకావడం అభినందనీయమని హెచ్ఎం సాంబయ్య అన్నారు. బుధవారం విడుదలైన రెండో జాబితాలో హనుమాద్రి చంద్రవర్ధన్‌గౌడ్ ఎంపికయ్యాడన్నారు. దీంతో విద్యార్థిని ఉపాధ్యాయులు హెచ్ఎం సాంబయ్యతో కలిసి శాలువాతో సత్కరించారు.

'పరిస్థితులను బట్టి పంటలు ఎంచుకోవాలి'

తూప్రాన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సీజన్, వాతావరణ పరిస్థితిని బట్టి కూరగాయల రకాలు ఎంచుకోవాలని ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ లావణ్య పేర్కొన్నారు. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి రైతువేదికలో జీడిమెట్ల సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఆధ్వర్యంలో కూరగాయల రైతులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ చంద్రశేఖర్

తూప్రాన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూప్రాన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న టేక్మాల్ శ్రీనివాస్‌ను వెల్దుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. మనోహరాబాద్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరెడ్డిని తహసీల్దార్‌గా నియమిస్తూ మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన శ్రీనివాస్‌ను, చంద్రశేఖర్‌రెడ్డిని సిబ్బంది, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి సన్మానించారు.

నర్సాపూర్ సమస్యలు తీరేనా..?

- నేడు నర్సాపూర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక
- మొదటిసారి వస్తున్న వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకమైన వివేక్ మొదటిసారి నేడు నర్సాపూర్‌కు రానున్నారు. మంత్రి రాకతోనైనా నిలిచిన అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో అనేక అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో, అరకొర వసతుల్లో సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. ముఖ్యంగా పట్టణంలో సమీకృత మార్కెట్ భవనం అసంపూర్తిగా ఉండటంతో కూరగాయల మార్కెట్ రోడ్డుపై నిర్వహించాల్సి వస్తుంది. మాంసం దుకాణాలను సైతం రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతోపాటు 500 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 250 పూర్తయినా పంపిణీ చేయకుండా అలాగే ఉంచుతున్నారు. సొంత భవనాలు లేక ఆర్డీవో, తహసీల్దార్, జూనియర్ సివిల్ కోర్టు, మున్సిపల్ భవనం, ఎక్సైజ్ సర్కిల్ భవనం లేక ఇతర శాఖల భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య సాగుతున్నాయి. సబ్‌రిజస్ట్రార్, లేబర్ ఆఫీస్ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక పీజీ కాలేజీ, మైనార్టీ గురుకులంతో పాటు పలు వసతిగృహాలరూ సొంత భవనాలు లేవు. పట్టణంలో మినీస్టేడియం, పార్కు లేదు. పచ్చని చెట్లు, ఎత్తైన గుట్టల మధ్య నర్సాపూర్ రాయరావు చెరువు ఎంతో సుందరంగా ఉంటుంది. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత అభివృద్ధే చెందే అవకాశం ఉన్నది. ఇక్కడి సమస్యలను స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తారో.. లేదో చూడాలి.



అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణం

ఎల్లుండి రేషన్‌కార్డుల పంపిణీ : పట్లోళ్ల

నారాయణఖేడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతులమీదుగా నూతన రేషన్‌కార్డుల పంపిణీని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. నూతన రేషన్‌కార్డుల కోసం తొలగింపులను చేపట్టినప్పటికీ, సభ్యులను రేషన్ కార్డులో చేర్చడం మాత్రం మరిచారన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 4 వేలకు పైగా రేషన్ కార్డులు మంజూరు కాగా వాటిలో 10,500 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. మరో 12,00 రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, విచారణ అనంతరం అర్హులకు మంజూరు చచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం : అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్/నర్సాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల ఉపకరణాల కోసం స్వీకరించిన దరఖాస్తు పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పరికరాల కోసం 122 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారని, వారి సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. త్వరలో అర్హులైన వారికి పరికరాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి హైమావతి, రవాణా శాఖ అధికారి విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిలా, డీపీఎం యాదయ్య పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఉత్పత్తుల విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేశామని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డి, మేనేజర్ మధుసూదన్, మెప్మా కోఆర్డినేటర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న నగేష్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు

పెద్దశంకరంపేట/టేక్మాల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చని మెదక్ జిల్లా ఉద్యానశాఖ అధికారి సంతోష్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లికి చెందిన వినయ్‌కుమార్‌శర్మ, విజయ్‌కుమార్‌శర్మ అనే రైతుల పొలంలో ఆయిల్‌పామ్, మెగా ప్లాంటేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ వేసుకునేందుకు ముందుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి క్రిష్ణ, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ క్రిష్ణారావు, అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినీత్, మమత, రైతులు పాల్గొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తాయని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవు కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పల్వంచ గ్రామంలో కుర్మ పద్మ, శంకరయ్య అనే రైతుల వ్యవసాయ క్షేత్రంలో మొదటిసారిగా ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ ఏడీఏ వినయ్‌కుమార్, టెక్నికల్ ఏవో వందన,మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అడవులు నరికి.. హద్దులు పాతి..

- 40 మంది స్పెషల్ టీంతో దాడులు
- తిరిగి భూములు స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఇరువురి అరెస్ట్, కేసులు నమోదు

రామాయంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అవిదట్టమైన అడవులు.. తండాలకు ఆనుకుని ఉండడంతో ఎవరు వస్తారులే అనుకున్న గిరిజనులు చెట్లను నరికేసి సొంత భూములుగా మార్చి హద్దులు పాతిన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి బాపనయ్యతండాలో వెలుగు చూసింది. సమాచారం అందిన వెంటనే 40 మందితో కూడిన ఫారెస్ట్ ప్రత్యేక బృందాలు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు దాడులు చేశాయి. ఈ మేరకు గిరిజనుల కబ్జా కోరల్లో ఉన్న భూములను స్వాధీన పరచుకున్నారు. ఇప్పటివరకు ఇరువురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. వారంరోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా తండావాసులు ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి చెట్లను తొలగించేశారు. ఎలాంటి అనుమానం రాకుండా చదును చేసి పంటలు పండించేందుకు సైతం సిద్ధమయ్యారు. దీంతో అటవీ సంరక్షణకు చెందిన ఫారెస్ట్ బృందాలు తిరిగి భూములను స్వాధీనం చేసుకున్నాయి. ఎవరైనా అడవులు కబ్జా చేస్తే చర్యలు తప్పవని జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



ఫారెస్ట్ భూములను స్వాధీనం చేసుకుంటున్న స్పెషల్ టీం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- రైతులకు హరీశ్‌రావు భరోసా



రైతుల సమస్యలను హరీశ్‌రావుకు వివరిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : భూములు కోల్పోతున్న రైతులు అధైర్యపడొద్దని, రైతుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతులకు భరోసా ఇచ్చారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబరు 109 భూములకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి బుధవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వివరించారు. ఈ భూములు కొన్ని దశాబ్దాలుగా రైతుల వినియోగంలో ఉన్నా రెవెన్యూ రికార్డుల్లో నమోదు లేకపోవడంతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో వారు అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. స్పందించిన హరీశ్‌రావు సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

హవేళిఘణపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల్లో క్లాస్ లీడర్స్ ప్రమాణ స్వీకరణంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డి, హరిబాబు, ప్రిన్సిపాల్ సృజన, ఏటీపీ నాగరాజు, సంతోష్, ఉపాధ్యాయులు భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

చిన్నశంకరంపేట/చేగుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రి స్థితిగతులపై వైద్యాధికారి డాక్టర్ సాయిసింధుతో సమీక్షించారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యాదగిరిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా డీఎంహెచ్‌వో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవ్య, డాక్టర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలను ఆగం చేయొద్దు

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్


సంగారెడ్డి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను నిలిపేసి విద్యార్థుల జీవితాలను ఆగం చేయొద్దని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ అన్నారు. సంగారెడ్డిలోని టీటీడీ కళ్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి రూ.7,200 కోట్ల బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు పాల్గొన్నారు.

'దాతల సహకారం అభినందనీయం'

చేగుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో వసతులు కల్పిస్తూ.. విద్యాబోధన జరిగినా.. ఏదో ఒక ఇబ్బంది ఉండడం సహజమేనని, అది గుర్తించి దాతలు సహకరించడం అభినందనీయమని ఎస్టీ రెసిడెన్షియల్ మూడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ గంగారాంనాయక్ పేర్కొన్నారు. చేగుంట ఎస్టీ స్పోర్ట్స్ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు దాతలు డాక్టర్ టీవీపీ చారి, డాక్టర్ హర్షవర్ధన్ రూ.3.50 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం దాతలను ప్రిన్సిపాల్ సుమతి, అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎస్టీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్, గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

సింగూరు జలాలు సేద్యానికివ్వాలి : గోదావరి

పుల్‌కల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు సింగూరు జలాలను విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరిఅంజిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సింగూరు జలాలను విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ నేత, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణితో కలిసి బుధవారం సింగూరు ప్రాజెక్టును సందర్శించారు. ముందుగా ప్రాజెక్టు ఎడమ కాలువ తూములు, నీళ్లు లేక బోసిపోయిన ఎడమ ప్రధాన కాలువను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు, కర్షకులు, కార్మికులు అధోగతి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసి పార్టీ అభ్యర్థులు గెలుపొందేలా కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనరసింహరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు అమ్మల నవీన్, నాయకులు పాల్గొన్నారు.



నీళ్లులేని ప్రధాన కాలువను పరిశీలిస్తున్న గోదావరి, మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ నేతలు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. సంగారెడ్డికి విచ్చేసిన వివేక్‌ను నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం, సహాయ కార్యదర్శి యాదగిరి తదితరులు ఉన్నారు.

మురికి కూపం.. మంజీర శోకం

(5వ పేజీ తరువాయి)

మళ్లీ పెరుగుతున్నాయని, ఈ విషయాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లామని ఇరిగేషన్ డీఈ నాగరాజు పేర్కొన్నారు. కలుషిత జలాల వల్ల దోమల వ్యాప్తి పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. కాల్వలో రొటేషనరీ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కలుషిత జలాల వల్ల పంట పొలాలకే కాదు, సమీప నీటి వనరులకు ప్రమాదమేనని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. డ్రైనేజీ నీరు కాల్వలో కలవకుండా పక్కకు మళ్లించే విధంగా శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని, పైపు లైన్ ప్రణాళిక రూపొందించాలని వారు సూచిస్తున్నారు.

నిధుల సమీకరణకు ప్రయత్నిస్తాం

మెదక్ పట్టణ ప్రధాన నాలాల గుండా మురుగు నీరు ఎంఎన్ కెనాల్‌లో కలుస్తున్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అంగీకరించారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని ఆయన తెలిపారు. డ్రైనేజీ వ్యర్థాలు పంట కాల్వలో కలవకుండా ఉండడానికి శాశ్వత పరిష్కార మార్గంగా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారని, ఇందుకోసం భారీ స్థాయిలో నిధులు సమీకరించాల్సి ఉంటుందని, అందుకు మార్గాలు అన్వేషిస్తామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

కాలనీల్లో థీమ్ పార్కులు : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, జూలై (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించడానికి ప్రత్యేకంగా థీమ్‌పార్కుల నిర్మాణాలు చేపడుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరినగర్ కాలనీలో జరుగుతున్న థీమ్ పార్కు నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో మిగులు భూముల్లో పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్థలం ఎక్కువగా ఉంటే అక్కడ థీమ్‌పార్కు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్, చక్రవర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణాబాయి

సంగారెడ్డి అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అరుణాబాయి తెలిపారు. సంగారెడ్డిలోని కళాశాలలో ఫస్టియర్ డిగ్రీ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల అయిన ఈ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం గొప్ప స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కస్తూరీ, ప్రభావతి, ఆయేషాబేగం, రామిరెడ్డి, గీతాశ్రీ, నవ్య, రాజేశ్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్ట్‌లో కబ్జాలు తొలగించాల్సిందే

కల్హేర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధి నల్లవాగు ప్రాజెక్టులోని ఎఫ్‌టీఎల్‌లో పరీవాహక ప్రాంత రైతులు కబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, పరిస్థితి ఇలాగే ఉంటే తాము ఆందోళన చేపడతామని బీజేపీ ఓబీసీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు నరేందర్ హెచ్చరించారు. 'ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ కబ్జా' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో సంచలనం కలిగించింది. దీనిపై స్పందించిన నరేందర్ మాట్లాడుతూ పైన పరీవాహక ప్రాంతంలో ఉన్న రైతులు కట్టలు వేసి పొలాలు చేసుకుంటున్నారని, దీనిపై గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పుడు ఏకంగా ప్రాజెక్టు కట్టకు సమీపంలోనే కబ్జాలకు పాల్పడటం దారుణమని అన్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి కబ్జాలు తొలిగించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పక్షాన పోరాటం చేస్తామని నరేందర్ హెచ్చరించారు.

ఆలయాన్ని పరిరక్షించుకోవాలి

- మహంకాళి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

రామాయంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మహంకాళి ఆలయాన్ని నూతన పాలకవర్గం పరిరక్షించుకోవాలని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సరాఫ్ యాదగిరి, దేమే యాదగిరి సూచించారు. బుధవారం రామాయంపేట మహంకాళీ దేవస్థాన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ శాఖ 12 మందితో కూడిన డైరెక్టర్లను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగారావు స్థానిక ఈవో రవికుమార్ పాలకవర్గంచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ్ ఎఫ్‌టీ చైర్మన్ పాండురంగాచారి, కాంగ్రెస్ నేతలు అల్లాడి వెంకటి, వినయ్, సాగర్, పోచమ్మల అశ్విని, బైకం కుమార్ పాల్గొన్నారు.

ఖాజాపూర్‌తండాలో కరెంట్ కష్టాలు తీర్చండి

చిన్నశంకరంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్‌తండాలో కొన్నిరోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. తండాలో కరెంట్ కష్టాలు తీర్చండని తండావాసులు బుధవారం మెదక్ ఎస్ నారాయణనాయక్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ తండాలో కరెంట్ సరఫరా కోసం కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ, తండావాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి : దళితులు

రామచంద్రాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లోని దళితుల కుటుంబాలకు చెందిన సర్వే నంబరు 7లో తమ సామాజిక కుటుంబానికి చెందిన వ్యక్తి అక్రమంగా నిర్మాణాన్ని చేపడుతున్నారని చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జీ.జాషువా, సామ్యేల్, చంద్రయ్య, పద్మారావు, మల్లయ్య కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి రాగా.. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌చేశారు. అయినా స్పందన లేదని బాధితులు పేర్కొన్నారు. సర్వే నంబరు 7లోని భూమి మూడు కుటుంబాలకు చెందిందన్నారు. అయితే భూమిని పంచుకున్న తరువాత ఎవరి స్థలంలో వారు ఇల్లు కట్టుకోవాలని పెద్ద మనుషులు చెప్పినా.. తమలోని ఒక వ్యక్తి తనకు అనుమతి ఉందంటూ నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. కొన్నిరోజులుగా అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. తమకు న్యాయం చేయకపోతే జిల్లా కలెక్టర్‌కు ఆశ్రయిస్తామన్నారు.

'రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి'

జిన్నారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం అయ్యమ్మ చెరువు పరిధిలో పంటలు సాగుచేసే రైతులకు కాలుష్య నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్ ఎంపీ.అశోక్ డిమాండ్ చేశారు. చెరువు పరిధిలో వందమందికి పైగా రైతులు స్థానిక పరిశ్రమల కాలుష్యంతో పంటలు సాగుచేయడం లేదని, ప్రతి ఏటా పరిశ్రమలు ఇవ్వాల్సిన నష్ట పరిహారాన్ని ఐదేళ్లుగా అందజేయకపోవడంతో వారంతా నష్టపోతున్నారని అశోక్ తెలిపారు. వెంటనే పరిహారం అందించకపోతే ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.